
# తీర్పు

'ఉషాపూర్వ'
దాసరి అమరేంద్ర

"హాయ్ ! ఎంత సేపయిందీ వచ్చీ "వెనక నుంచి భుజం మీద తడుతూ అంది సుజాత.

"అబ్బో...పావుగంట దాటేసింది... ఏవీ ఇంత ఆలస్యం అయిందేం ?"సీటు మీద కూర్చునే స్కూటరు స్టార్టు చేస్తూ అడిగాడు రవి.

"మామూలే.. ఏదో అర్జెంటు రిపోర్టట రేపు బెంగుళూరు మీటింగుకు కావాలట... తెల్లారు ఝామునే ఫ్లైట్లో తనతో తీసుకెళ్లాలట.. బాబ్బాబు మా తల్లివి గదూ పూర్తి చేసి వెళ్లమ్మా అని గడ్డం పుచ్చుకొని బతిమాలాడు మా బాసాసురుడు. పోన్లే పాపమని పూర్తి చేసి వస్తున్నా.." వెనక సీట్లో సర్దుకొంటూ చెప్పింది.



"అయ్! నీ గడ్డం పట్టుకోడానికి వాడికెన్ని గుండెలూ" హుంకరించాడు రవి. కిలకిలా నవ్వింది సుజాత.

న్యూట్రల్లోంచి మొదటి గేరులోకి మార్చి స్కూటర్ని ముందుకు ఉరికించాడు రవి. చకచకా గేర్లు మారి స్పీడందుకొంది

"ఏవిటాస్పీడూ.. కొంచెం మెల్లగా పోనియ్యవయ్యా" బిక్కు బిక్కు మంటూ అంది సుజాత.

"ఆ.....ఆ.... ఇప్పటికే మన డేకేర్ సెంటర్ మూసేసే టైమయిపోయింది. ఇంకా మనం పెళ్లినడకలు నడిస్తే ఆ సెంటరావిడ వేసే అక్షింతలను తినాల్సివస్తుంది. ఎప్పుడో ఓ రోజు పాపను రోడ్డు మీద వదిలేసి వెళ్లిపోయినా వెళ్లిపోతుందావిడ. "స్పీడు తగ్గించకుండా స్కూటర్ని సాయంత్రపు రద్దీలో లాఘవంగా నడుపుతూ అన్నాడు రవి.

ఆరున్నర అవుతోంది. దూరాన అస్త మిస్తోన్న సూర్యుడు వానాకాలపు మబ్బుల్ని హుస్సేను సాగరపు జలాలనీ రంగుల్లో ముంచెత్తుతున్నాడు. టాంక్ బండ్ మీది చల్లని గాలి రోజంతటి అలసటనూ పోగొట్టేసేద దీరుస్తోంది. ఆ రోడ్డుమీద హడావుడిగా సాగిపోతున్న వందలాది వాహనాలను అటు శాతవాహనుడి దగ్గర్నుంచి ఇటు శ్రీరంగం శ్రీనివాసరావు దాకా కొలువుతీరి ఉన్న మహానుభావులందరూ చిద్విలాసంగానూ చిరు ఆందోళనలోనూ పరకాయిస్తున్నట్లు అనిపిస్తోంది. కుడి వేపున కనబడుతున్న బుద్ధ భగవానుని చూపులతో పలకరిస్తూ హుస్సేను సాగరపు తీరాన ఉన్న ఆకాశమార్గం మీదుగా సాగిపోయి విశ్వేశ్వరయ్య విగ్రహం దాటుకొని చింతల్ బస్తీలోని డేకేర్ సెంటర్ చేరారు రవీ సుజాతలు.

ఆరున్నర దాటి పదహారు నిముషాలు

"ఏమండీ సుజాతగారు ..మళ్లా లేట య్యారూ.." సెంటరావిడ నవ్వుతూనే పలక రించినా అందులోని నిష్టూరం సుజాతను దాటిపోలేదు.

"సారీ ! తప్పలేదండీ" అంతకన్నా ఇంకేం చెప్పాలో తెలియలేదు.

"మమ్మీ!" లోపల్నించి సుడిగాలిలా దూసుకొచ్చి సుజాత ఒడిని చుట్టేసిందిసౌమ్య. "చూడు. మళ్లా ఆలస్యంగా వచ్చావు. శ్రీకర్,శిరీష, ప్రవీణ్ ప్రణత్....వాళ్ల అమ్మా నాన్నా అయితే ఎప్పుడో వచ్చి తీసుకెళ్లి పోయారు" కళ్లనీళ్ల పర్యంతమవుతూ అంది.

పాప బుగ్గపుణికి, ఎత్తుకొని స్కూటర్ వెనక సీట్లో సర్దుకొంది సుజాత. స్కూటరు మళ్లా పరుగందుకొంది.

"డాడీ! నాకు చాలా కోపంగా ఉంది మీమీద ఎప్పుడూ చాలా ఆలస్యంగా వస్తారు.. అసలు నేను పెద్దయిన తర్వాత నేను కూడా ఆఫీసుకు వెళ్లి మీఇద్దర్నీ ఆ ఆంటీ దగ్గర రోజంతా ఉంచి సాయంత్రం చాలా చాలా ఆలస్యంగా వస్తాను. అప్పుడు తెలుస్తుంది మీకు..."

ఫక్కున నవ్వింది సుజాత "అన్నీ సినిమా కబుర్లు" అంది.

పాప మాటల్లోని ఆక్రోశం అర్థమయింది రవికి ప్రాణం చివుక్కుమంది.

మెడినోవా ధృవతారలో తమ అపార్టు మెంటు చేరేసరికి ఏడు దాటేసింది. తిమిరంతో చేసిన సమరంలో మరోసారి వెలుతురు వెన్నుచూపింది.

"ఫ్రిజ్‌లో కూరలువ్నాయి గదూ" అడిగాడు రవి.

"లేవు...నిన్నంతా కరెంటుపోయింది గదా...ఉన్నవన్నీ పాడయిపోయాయి" ఉసూరుమంటూ చెప్పింది సుజాత.

గబగబా టవలందుకొన్నాడు. వెంటనే స్నానం చెయ్యకపోతే ప్రాణం నిలవదని పించింది. ఆ నిలచిన ప్రాణం నీరసంలోంచి బయటపడి జవసత్వాలను పుంజుకోడాని కున్న అతి సులువైన మార్గం కాఫీ సేవనం.

"మా తల్లివిగదూ... కొంచెం కాఫీ పెట్టవూ..

ఈలోపల స్నానం చేసొస్తా."

సుజాత వంటింటికేసి నడిచింది.

రవి బాత్‌రూంలో దూరాడు.

"రాగానే ఆ పేపరు పట్టుకొని కూర్చోకపోతే కాస్సేపు వంటింట్లోకి రారాదూ !" స్నానం చేసి మల్లెపువ్వులాంటి లుంగీ కట్టుకొని చొక్కాలేని శరీరంలోంచి మంచి గంధపు పరిమళాలు ఒలికిస్తూ వాలు కుర్చీలో జారబడి పేపరులో తలదూర్చిన రవిని మురిపెంగా చూస్తూ కాఫీ అందిస్తూ అంది సుజాత.

"ప్లీజ్ పిల్లా. పొద్దున్న ఎలానూ హడావుడే. హెడ్‌లైన్స్ కూడా చూడలేదు.. మళ్లా అన్నంతినగానే నిద్ర ముంచుకొస్తుందాయె. ప్రపంచంలో కొత్త సమస్యలు ఏమేం పుట్టుకొస్తున్నాయో ఇప్పుడైనా తెలుసుకోపోతే రేపు ఆఫీసులో కొలీగ్స్ తోకలిసి ఆ సమస్యలకు పరిష్కారాలు వెదికేదెలా ?" వేడికోలుగా అన్నాడు రవి.

వేడికోలు ఫలించలేదు. ముద్దుగా పేపరు లాగేసి మడిచి పక్కన పెట్టింది సుజాత. బుద్ధిగా వంటింట్లోకి నడిచాడు రవి.

పక్కింటి బాబు వచ్చినట్లున్నాడు. ఆటల్లో పడింది సౌమ్య. "అమ్మా నాకుక్కరూ గాస్ స్టవ్వూ ఎక్కడా" అంటూ వచ్చింది. వెదికి ఇచ్చింది సుజాత.

"పాలుకాచి పాపకివ్వండి. కొంచెం ఉల్లి' పాయలు తరిగిపెట్టండి" పురమాయించింది. ఇష్టంగానే పనిలో పడ్డాడు రవి.

"అసలు మీ మగవాళ్లంత స్వార్థపరులు ఉండరీ ప్రపంచంలో"ఉరుములేని మెరుపు, పిడుగులా మెరుపుదాడి చేసింది సుజాత. వర్షాకాలపు ఉక్కపోతకు తన జాకెట్టంతా చెమటతో తడిసిపోయింది. దూరానికే చెమట వాసన. ఆ మాగువాసన కర్ణపుటాలను తాకి చిరాకు పుట్టించింది రవికి.

"సర్లే! మగవాళ్లంత స్వార్థపరులింకెవరైనా అంటూ ఉంటే అది మరి ఆడవాళ్లే అవ్వాలి. ఇది మానవజాతికి పుట్టుకతో వచ్చిన లక్షణం గదా "హాస్యమాడాడు.

"జోకులు గాదయ్యా! పాయింటుకురా అసలీ ఇంటి పనీ వంటపనీ ఆడవాళ్లే తగలెట్టాలని రూలు పెట్టిన వెధవెవడో కనబడితే గడ్డిపెట్టాలి" కయ్యానికి కాలు దువ్వింది.

"సరే సేుగాన్ు. అగడ్డేదో ఫ్రిజ్‌లో భద్రంగా దాచి ఉంచు. ఎప్పుడు కనబడితే అప్పుడు వడ్డిద్దువుగాని"



"అది కాస్త నీకూ తాలింపు పెట్టి వడ్డిద్దామనీ"

"నాకా ! అన్యాయం. నేను నీకు ఏం సాయంగావాలంటే ఆ సాయం చెయ్యడం లేదూ?!"

నిజమే. రవికి పట్టింపులు లేవు. అంట్లూ చీపురూ తప్పించి ఏ పని చెప్పినా చేస్తాడు.

"అదిగో అక్కడే ఒళ్లు మండేది. ఆ మగ బుద్ధేవద్దనేది. సాయమేమిటయ్యా సాయం ..డైనింగ్ టేబుల్ దగ్గరమేతకోసం అవురావురుమని ఎగబడే మీ మగజాతి వంటపనీ అనే సరికి సాయం అంటూ సన్నాయి నొక్కులు నొక్కుతుంటారేం?!" నిలదీసింది.

పొరపాటు అర్థమయింది. నాలిక కరుచుకున్నాడు రవి.

"సరే తల్లీ! పొరపాటే బుద్ధిగడ్డి తిని సాయం అన్నమాట వాడాను. అయినా నువ్వు లేనప్పుడు వంటంతా నేను ఒండుకోవడం లేదూ ?"

కాలేజీ రోజులనుంచే అందరికీ అన్ని పనుల్లూ చేతనవ్వాలి, అని నమ్మి స్వయం పాక శాస్త్రంలో ప్రావీణ్యం సంపాదించి తన వంట మీద తాను నిలబడిన వాడు రవి. చలం అభిమాని. మార్క్సు గారి బడి అంటే గురి. ఆడా మగల సమానత్వం విషయంలో అభ్యుదయ భావాలున్నాయి.

"వెనకటి కెవడో నీలాంటి బడుద్దాయి అలిగి అన్నం పెట్టడమే ఘనకార్యమన్నాడట. నీ వరకూ నువ్వు ఒండుకోవడం కాదోయ్. నన్ను చూస్తే మరి ఆ మంచి బుద్ధి ఏగంగలో కలుస్తోంది ? ఏ వల్లకాటికి వలసపోతోందీ ? కూర ముక్కల్ని కలుపుతూ అంది "నన్ను మాయమాటలు చెప్పి ఈ చెమటల గదిలోకి తోలి నువ్వేమో టింగురంగా అంటూ మైసూరు సాండల్ వాసనలమధ్య పేపరులో మునిగి పోడానికి నీకు ప్రాణమెలా ఒప్పుతోందీ? కడిగేసింది సుజాత.

విషయం అర్థమయింది రవికి ఉక్రోషానికి మూలకారణం బోధపడింది.

"ఎందుకూ ఆ గయ్యాళితనం. నా వంట నీకు నచ్చదయ్యే! వంద ఒంకలు పెడతావు నీకేమో ఆరు రుచులుగావాలి. ఆ పిల్ల దెయ్యానికి మరో మూడు. నాదేమో సాధూమహరాజ్ బాపతు వంట. మరికుదిరేదెలా ?"

"నేర్చుకోమంటాను, కనీసం మూడు రుచుల వంట అయినా చేసి తరించమంటాను. 'నా వంటనీకు నచ్చదు' అంటూ పనికిరాని కబుర్లు చెప్పి పని ఎగ్గొట్టవద్దంటాను' 'తర్కించింది వట్టువదలని విక్రమార్కి సుజాత.

"అన్యాయం అమ్మాయ్. మరీ దారుణంగా మాట్లాడుతున్నావ్. నేను పని దొంగనా ? ఇద్దరం ఉద్యోగాలు చేసుకొంటున్నపుడు ఇంటి పనులూ వంటపనులూ పంచుకోవాలని నాకు తెలియదూ ? నన్ను మరీ ఎమ్ సీ పీ కింద కట్టేస్తున్నావ్. ఈ దారుణం సహించను""

"పోవయ్యా బడాయి కబుర్లా ఆడామగాల సమానత్వం గురించి నీకు థీరీలు తెలుసేమోగానీ ఆచరణ పూజ్యం" తేల్చేసింది సుజాత. చిరాకనిపించింది రవికి. "ఐ అబ్జెక్ట్ దిస్. ఒప్పుకోను. చేతనయితే నీ ఆరోపణలు నిజమని నిరూపించు" ఛాలెంజి విసిరాడు

స్టౌమీదనుంచి అన్నం పెట్టిన కుక్కరు దించింది. వంట పూర్తవవస్తోంది. ఎనిమిదయిపోతోంది. ఇంకా ఆలస్యమయితే తిండి తినకుండా సౌమ్య పడక వేసే ప్రమాదముంది.

"చూడు మమ్మీ... చూడు చూడు" కొంపలంటుకుపోతున్నట్టు పరిగెత్తుకొచ్చింది సౌమ్య. అప్పటి దాకా చక్కగా ఆడుకొంటోన్న దానికి మరి ఇంతలో ఏం ముంచుకొచ్చిందో!

"శంకర్ చూడు. తను అన్నం వండుతానంటున్నాడు "

శంకర్ పక్కింటి బాబు. సౌమ్యకు బెష్టు బాయ్ ఫ్రెండు.

"అసలు మీరేం ఆట ఆడుకొంటున్నారూ ?' ' అడిగింది సుజాత.

"అన్నం కూరలాట. నా కుక్కరూ గాస్‌స్టవ్వూ తీసుకెళ్లాగదా. అన్నం నేను వండాలిగదా. అహ అలాగాదు నేను వండుతానంటున్నాడు శంకర్"

తప్పుచేసిన వాడిలా శంకర్ వచ్చి సౌమ్య

వెనక నుంచున్నాడు. వాడు సౌమ్యకన్నా ఆరునెలలు పెద్దే అయినా ఆటల్లో పెత్తనమంతా సౌమ్యదే ! అమ్మచాలు.

విషయం చూచాయగా బోధపడింది సుజాతకు. చిరాకు విడింది రవికి పని కల్పించింది సుజాత.

"పోనీ వాడినే వండనివ్వు. నీ సొమ్మేం పోయిందీ?"

"అదెలాగూ ? అన్నమూ కూరలూ ఆడపిల్లలు గదా వండేదీ ?"

బాణవు ములుకుల్లా తగిలాయా మాటలు. కరెంటు షాకు తిన్నవాడిలా ఎగిరి పడ్డాడు రవి.

"కాదమ్మా! అన్నం ఎవరైనా వండవచ్చు. తప్పేం లేదు. పోనీ అబ్బాయిలు ఏమేం పనులుచేస్తారో చెప్పు" ఆశగా అడిగాడు రవి.

"పేపరు చదువుతారు. ఉత్తరాలు రాస్తారు. నిద్దరపోతారు. టీవీ చూస్తారు. బజారుకెళ్లి సరుకులు తెస్తారు. అప్పుడప్పుడు పాట రాస్తారు. ఆ... మర్చిపోయాను ఉల్లిపాయలు కూడా కోస్తారు.. అంతే గానీ అబ్బాయిలు ఎక్కడైనా అన్నం కూరా వండుతారా ?" నిస్పష్టంగా తేల్చి చెప్పింది సౌమ్య.

అర్థవంతంగా నవ్వింది సుజాత.

అర్థమయినట్లు తల పంకించాడు రవి.

☆

